మామిడి రైతులు సలహాల పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

అవగాహన కార్యక్రమానికి హాజరైన మామిడి రైతులు, అధికారులు

సిర్పూర్(టీ), మార్చి 12 : మామిడి సాగులో మంచి దిగుబడులు సాధించాలంటే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడి సాగుపై దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం లోనవెల్లి గ్రామంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయాధికారి మధులత, హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో పార్థి అశోక్

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 12 : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, అప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో పార్థి అశోక్ అన్నారు. సార్సాల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను గణితంపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ఉత్సాహం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సైన్స్, గణిత కార్నర్‌లను పరిశీలించారు. విద్యపై ఆసక్తి పెంచేలా తయారు చేసిన అంశాలపై సంతోషం వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి సత్యనారాయణ, సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్‌లు సత్యనారాయణ, కటుకం మధూకర్, ఉప్పలేటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రామణి, ఉపాధ్యాయులు నగేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

విద్యుత్ మోటర్‌లేని బోరు

బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

లోతొర్రెలో తాగునీటి తిప్పలు

మిషన్ భగీరథ నీళ్లు రాక గిరిజనుల పాట్లు

- మోటర్ కాలిపోవడంతో అష్టకష్టాలు
- పక్షం రోజులైనా పట్టించుకోని అధికారులు
- బోరుబావులపైనే ఆధారం

> అధికారుల నిర్లక్ష్యం ఆ ఊరి ప్రజలకు శాపంగా మారింది. 'మిషన్ భగీరథ' మోటర్‌కు మరమ్మతు చేపట్టకపోవడంతో తాగు నీటికి తిప్పలు పడాల్సి వస్తున్నది. పక్షం రోజులుగా పక్కనున్న గూడేనికి వెళ్లి బిందెల్లో నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొనగా, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గిరిజనం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.
> - జన్నారం, మార్చి 12

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోనున్న లోతొర్రె గ్రామ గిరిజనులు తాగు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడ 60 కుటుంబాలుండగా, 200 జనాభా ఉంది. కేసీఆర్ సర్కారులో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరందుతున్నది. పక్షం రోజుల క్రితం మోటర్ కాలిపోగా, అధికారులు పట్టించుకోకపోవడంతో గుక్కెడ నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. పక్కనే ఉన్న అగూడెంలో ఉన్న బోరు బావుల వద్దకు కాలినడకన వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ గోస తీర్చాలని వేడుకుంటున్నారు.

మోటర్‌ను రిపేరుకు పంపినం..

మిషన్ భగీరథకు ఉపయోగించే విద్యుత్ మోటర్ చెడిపోయింది. ఆ మోటర్ కొన్నప్పుడు కంపెనీ గ్యారంటీ ఇచ్చింది. సంబంధిత డీలర్ వద్దకు పంపించినం. అది రిపేరై వచ్చిన వెంటనే అమర్చి నీటిని సరఫరా చేస్తాం. అప్పటి వరకు గ్రామస్తులు సహకరించాలి.

- రమేశ్, పంచాయతీ కార్యదర్శి

నీరు సరఫరా చేయాలి..

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. మోటర్ పాడైపోయిందని చెబుతున్నరు. మహిళలు నీళ్ల కోసం ఇబ్బందులుపడుతున్నరు. మూగ జీవాలకూ నీరు దొరకడం కష్టంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి మోటర్‌కు మరమ్మతు చేయించి తాగు నీరు సరఫరా చేయాలి.

- బోడ శంకర్, మాజీ ఉపసర్పంచ్, లోతొర్రె

మోటర్ మంచిగ చేయించాలె..

కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చి మా తాగు నీటి తిప్పలు తీర్చింది. ఇప్పటి దాకా రంది లేకుంట ఇంటింటికీ నీళ్లచ్చినయి. ఇప్పుడు మోటర్ పాడైందని చెబుతున్నరు. అసలే ఎండాకాలం. మహిళలు నీళ్ల కోసం బోరు బావుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే మోటర్‌ను మంచిగ చేయించి నీళ్లందించాలి.

- కుర్సింగు గంగారాంపటేల్, గ్రామ పెద్ద

జిల్లా	వచ్చిన అప్లికేషన్లు	ఫ్రీ కరెంట్ వస్తున్నోళ్లు
ఆసిఫాబాద్	1,13,260	64,379
నిర్మల్	2,26,586	1,77,486
ఆదిలాబాద్	1,61,366	61,000
మంచిర్యాల	1,91,000	98,000
మొత్తం	7,10,212	4,00,865

మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయానికి గృహజ్యోతి కోసం పోటెత్తిన జనం

సగం మందికే

గృహ జ్యోతి..

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్నది ఏడు లక్షల పైచిలుకు

- అర్హత సాధించినది నాలుగు లక్షల మందే..
- ఉచిత కరెంట్ కోసం క్యూ కడుతున్న జనం

> అర్హత సాధించినది నాలుగు లక్షల మందే.. ఉచిత కరెంట్ కోసం క్యూ కడుతున్న జనం

మంచిర్యాల, మార్చి 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు జనాలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎంతో ఆర్భాటం చేసి తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం అందరికీ రావడం లేదు. 200 యూనిట్ల లోపు కరెంట్ వాడుకున్న వారికి ఈ నెల బిల్లు వచ్చింది. దీంతో జనం హైరా నా పడిపోతున్నారు. పక్కింటి వాళ్లకు రాయి తీ ఇచ్చి మాకు ఎందుకు ఇవ్వడం లేదని వా పోతున్నారు. ఉచిత కరెంట్ మేము ఏమైనా అడిగినమా.. ఇచ్చేటోళ్లు అందరికీ ఇవ్వాలే గానీ ఒకరికిచ్చి ఇంకొకరికి ఇవ్వకపోవడం ఏంటని మండి పడుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గృహ జ్యోతి(200 యూనిట్ల ఉచిత కరెంట్)కు 7,10,212 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో నాలుగు లక్షల మందికే జీరో బిల్లులు వచ్చాయి. దీంతో వైట్ రేషన్ కార్డులు ఉండి కూడా అర్హత సాధించ లేకపోయినోళ్లు మళ్లీ ఇప్పుడెళ్లి ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరుతున్నారు.

వివిధ కారణాలతో నిలిచిన మంజూరు

ఆసిఫాబాద్‌లో 1,26,706, నిర్మల్‌లో 2,08,486, మంచిర్యాలలో 2,19,184, ఆదిలాబాద్‌లో 1,91,772 మొత్తంగా 7.50 లక్షల కుటుంబాలు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్నాయి. వీరిలో ఏడు లక్షల మంది ప్రజాపాలనలో ఉచిత కరెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ.. ఈ నెల ఇప్పటి వరకు వచ్చిన కరెంట్ బిల్లుల్లో 4 లక్షల మందికి మాత్రమే ఫ్రీ ఇచ్చారు. మిగిలిన వారిలో చాలా మందికి 200 యూనిట్లలోపు ఉన్నప్పటికీ బిల్లు మాత్రం ఎప్పటి మాదిరిగానే వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 6 లక్షల పైచిలుకు కరెంట్ బిల్లులు జనరేట్ చేస్తే ఇందులో 60 శాతం మందికి మాత్రమే ఫ్రీ వచ్చినట్లు సమాచారం. మిగిలిన వారికి బిల్లు యథావిధిగా వచ్చింది. ఇక ఇప్పటి వరకు బిల్లులు రానివాళ్లలోనూ సగం మంది మాత్రమే అర్హులుంటారని తెలుస్తున్నది. దాదాపు వచ్చిన అప్లికేషన్లలో 200 యూనిట్ల లోపు కరెంట్ వినియోగించుకునే వాళ్లే 95 శాతానికి పైగా ఉన్నారు. కాకపోతే ఇందులో కొందరికి తెల్లరేషన్‌కార్డులు లేకపోవడం, ఆధార్‌కార్డు నంబర్లు సరిగా ఎంటర్ చేయకపోవడం, కస్టమర్ ఐడీ సరిగా ఇవ్వకపోవడం మొదలైన కారణాలతో ఉచిత కరెంట్ అనేది మంజూరుకాకపోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఒకవేళ అన్ని సరిగ్గా ఉన్నా 200 యూనిట్లు దాటి బిల్లు వచ్చి ఉండొచ్చంటున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించడానికి ప్రజాపాలన సెంటర్లను ఏర్పాటు చేశామంటున్నారు. మరోవైపు గృహజ్యోతి కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్లకు జనం పోటెత్తుతున్నారు. మేం వాడుకుంది 200 యూనిట్లలోపే ఉన్నా మాకు బిల్లువచ్చిందని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రజాపాలన పాత అప్లికేషన్ చూపించి అధికారులను నిలదీస్తున్నారు. చేసేదేం లేక మరోసారి అప్లికేషన్లు పెట్టుకుని నిరాశగా వెనుతిరుగుతున్నారు.

రోగైనా.. శవమైనా మా అంబులెన్స్‌లోనే..

మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన వద్ద ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్ల దౌర్జన్యం

- మృతదేహం ఉన్న వాహనాన్ని అడ్డుకొని వాగ్వాదం
- 'నమస్తే'ను గమనించి పరుగులు

ఆంబులెన్స్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన సాక్షిగా ప్రైవేట్ అంబులెన్సు డ్రైవర్లు, ఓనర్లు కాసులకోసం కక్కుర్తి పడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులు.. క్షతగాత్రులు.. చివరికి మృతదేహమైనా.. తమ అంబులెన్స్‌లలోనే తీసుకెళ్లాలని, లేదంటే డబ్బులు చెల్లించాల్సిందేనని దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. దు:ఖంలో ఉన్నవారిపై మానవత్వం చూపించకుండా ముక్కుపిండి మరీ తమకు కావాల్సినంత వసూలు చేసుకుంటున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన ఘటనే ఇందుకు చక్కని ఉదాహరణ.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నామనగర్‌కు చెందిన సాయికుమార్ సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందగా, పోస్టుమార్టం కోసమని అక్కడి నుంచి అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత తిరిగి అదే అంబులెన్స్‌లో తరలించేందుకు సిద్ధం కాగా, స్థానిక అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు అడ్డుకున్నారు. మీకు తీసుకురావడమే తప్ప.. ఇక్కడి నుంచి ఏది వెళ్లాలన్నా తమ అంబులెన్స్‌లలోనేనని మృతుడి బంధువులు, అక్కడి అంబులెన్స్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇది గమనించిన కాగజ్‌నగర్ పోలీసులు జోక్యం చేసుకోవడం.. అదే సమయానికి 'నమస్తే తెలంగాణ' ఫొటోలు తీయడంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ ఘటనను చూసిన వారంతా.. 'శవాన్ని తీసుకెళ్తుంటే ఇదేం రాద్దాంతమని, అసలు వీరు మనుషులేనా.. శవాలపై పైసలు ఏరుకుంటారా..' అంటూ మండిపడ్డారు. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బంధువులు, అంబులెన్స్ డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న లోకల్ ఆంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు

వన్యప్రాణుల దప్పిక తీరేలా..

వేసవి నేపథ్యంలో అడవుల్లో సహజసిద్ధంగా నీటి సౌకర్యం కల్పిస్తున్న అటవీశాఖ

- రాంప్‌వెల్స్‌తో పాటు చెలిమెలు ఏర్పాటు
- సోలార్ పంపుల ద్వారా చెరువులు, కుంటలు నింపుతున్న అధికారులు

జన్నారం నర్సింగాపూర్ వాగులో ఏర్పాటు చేసిన చెలిమె

జన్నారం, మార్చి 12 : వేసవి నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. సహజసిద్ధంగా తాగు నీరందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. ఈ మేరకు కవ్వాల్ టైగర్ రిజర్వుడ్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేటరేంజ్‌లలోని అడవుల్లో తాగు నీటి సౌకర్యం కల్పిస్తున్నది. వాగుల్లో చెలిమెలు, రాంప్‌వెల్స్ వంటివి ఏర్పాటు చేస్తూనే.. సోలార్ పంపుల ద్వారా కుంటలు, చెరువుల్లో నీటిని నింపుతున్నది.

రాంప్ వెల్స్

వన్యప్రాణులు సులువుగా నీరు తాగేలా అడవుల్లో రాంప్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఊటలు ఉన్నచోట 10 మీటర్ల వెడెల్పు, 3 మీటర్ల లోతు గుంతలు తవ్వుతున్నారు. జీవాలు అందులోకి దిగి దాహం తీర్చుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఆయాచోట్ల సుమారు 30 రాంప్ వెల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వాగుల్లో చెలిమెలు

టైగర్ రిజర్వుడు ఫారెస్ట్‌లో ఉన్న వాగుల్లో చెలిమెలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి చెలిమెకు మధ్యలో 500 మీర్ల దూరంలో ఉండేలా చూస్తున్నారు. వన్యప్రాణులు అందులోకి సులభంగా నీరు తాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కుంటలు, చెరువుల్లో నీరు నింపడం

అడవుల్లో సోలార్ పంపుల ద్వారా కుంటలు, చెరువుల్లో నీటిని నింపుతున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన సాసర్ వెల్స్‌లలో రెండు రోజులకోసారి నీటిని నింపడమేగాక.. అందులోని చెత్తను తొలగిస్తున్నారు.

సహజసిద్ధంగా ఏర్పాట్లు

ఎఫ్‌డీపీటీ,డీఎఫ్‌వో ఆదేశాల మేరకు కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో వన్యప్రాణులకు ఆహారంతో పాటు సహజసిద్ధంగా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాంప్ వెల్స్‌తో పాటు వాగుల్లో 500 మీటర్లకో చెలిమె ఏర్పాటు చేస్తున్నాం. సోలార్ పంపుల ద్వారా కుంటలు, చెరువులు నింపుతున్నాం. - హఫీసొద్దీన్, జన్నారం రేంజ్ ఆఫీసర్

జన్నారం కవ్వాల్ అడవుల్లో వేసిన నూతన బోర్, పంపు

జన్నారం తాళ్లపేట రేంజ్‌లోని బైసన్ కుంట

సోలార్ పంపు ద్వారా సీసీ సాసర్ వెల్‌లో నింపిన నీరు

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 12 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎల్ఏ ఆర్ అండ్‌ఆర్ ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళతో కలిసి ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో 1950 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయపార్టీల సమావేశాలను రికార్డు చేయాలని, సమావేశాల ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార సమయంలో తప్పనిసరిగా అనుమతి పొందాలని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, అకౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

జోడువాగుపై బ్రిడ్జి నిర్మించాలి

- సీపీఎం, సీపీఐ నాయకుల డిమాండ్
- ర్యాలీ.. తహసీల్దార్‌కు వినతి

భీమారం, మార్చి 12 : భీమారం శివారుప్రాంతంలోని జోడువాగుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారిందని, దాని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ర్యాలీ తీయగా, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకే రవి మాట్లాడుతూ జోడువాగుపై బ్రిడ్జితో పాటు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిరోంచ వరకు వేసిన రోడ్డు నాసిరంగా నిర్మించడంతో గుంతలు పడ్డాయని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు గాయపడిన, మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాన్నారు. అనంతరం తహసీల్దార్ సందానందంకు వినతి పత్రం ఇచ్చిరు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు ఉమారాణి, సమ్మక్క, చంద్రన్న, నగేశ్, కావిరి రవి, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్ కుమార్, గోమాప ప్రకాశ్, దూలం శ్రీనివాస్, ఐద్వా నాయకులు నిర్మల,జ్యోతి, డీవైఎఫ్ అనిల్, పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌కు భూములిచ్చేది లేదు

- ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
- న్యాయం చేయాలని ఐబీ చౌరస్తా వద్ద రాస్తారోకో

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : నేషనల్ హైవేకు తమ భూములిచ్చేది లేదని లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులు తెగేసి చెప్పారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. భూములు కోల్పోతున్న వారు మంగళవారం హియరింగ్‌కు రావాలని ఆర్డీవో కోరిన విషయం విదితమే. పాత ప్లాన్ ప్రకారమే హైవే నిర్మాణం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని స్థానిక ఐబీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం భూములిచ్చామని, ఇగ ఉన్న కొద్ది పాటి భూములు కూడా లాక్కుంటే తామంతా ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న రోడ్డు వెంటే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆర్డీవో రాములుకు వినతి పత్రం అందజేశారు.

ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఎన్‌హెచ్-63 బాధిత రైతులు